ధాన్యం దళారుల పాలు

వేములవాడరూరల్: పక్కన ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్‌లో రైతుల తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఇది ఒక ఆ గ్రామంలోనే కాదు.. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. ఎన్నికల గోలలో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు కొనుగోలు కేంద్రాల ఊసెత్తకపోవడంతో, ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు పల్లెలో కొనుగోళ్లపై దృష్టి పెట్టారు. రైతులకు మాయమాటలు చెప్పి కల్లాల్లోనే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే వరకు ధాన్యం నిలువ చేసుకునేందుకు అవసరమైన స్థలం లేక, వివిధ కారణాల దృష్ట్యా దళారులకు తప్పనిసరిగా తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు.

- కల్లాల వద్దే ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- కల్లాల్లో పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు


ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకుంటున్న రైతన్నలు

ముందస్తు కొనుగోళ్లను ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటికీ ఎక్కడా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించలేదు. దీంతో వర్షాకాలం పంట కోతలు జోరందుకున్నా చేతికి వచ్చిన పంట విక్రయించేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. 10 రోజులుగా వేములవాడ మండలంలో ధాన్యం రైతుల చేతికి వచ్చి, కల్లాల వద్ద విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారు. సొసైటీ శాఖ తరుపున ప్రతి సంవత్సరం రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. కానీ ఇప్పటి వరకు ధాన్యాన్ని ప్రారంభించకపోవడంతో గత్యంతరం లేని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రస్తుతం మామూలు ధాన్యానికి ధర రూ.2,018 ఉండగా గ్రేడ్–ఏ ధాన్యానికి రూ.2,200 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు కేవలం రూ.1,700 నుంచి రూ.1,750 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దాదాపు క్వింటాల్‌కు రూ.500 తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో వరి పంటనే రైతులు అత్యధిక శాతం సాగు చేశారు. రూరల్ మండలంలో 10 వేల ఎకరాల్లో సాగు చేయగా అర్బన్ మండలంలో 5 వేల ఎకరాల వరకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు మండలాల్లో అంచనా ప్రకారం 2.50 లక్షల క్వింటాళ్ల వరకు ఈ వర్షాకాలం పంట రావచ్చని ఏవో సాయికిరణ్ తెలిపారు. ఇప్పటి వరకు 50 ఎకరాల వరకు వరి పంటను రైతులు కోసి ధాన్యాన్ని కల్లాల వద్ద ఆరబెట్టినట్లు ఆయన తెలిపారు.

15 కేంద్రాల్లో కొనుగోళ్లు

వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ప్రతి సంవత్సరం ధాన్యం కొనుగోళ్లను చేస్తుంటారు. 17 గ్రామాల్లో 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రాల్లో తూకాలు వేసి జిల్లా అధికారులు సూచించిన రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తారు. రైతులు ధాన్యాన్ని తరలించిన వెంటనే విడతల వారీగా వారి ఖాతాలో డబ్బులను సొసైటీ తరుపున జమ చేస్తుంటారు. గ్రామాల్లో రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు కూడా స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రైతులు ప్రైవేటు స్థలాలను అద్దెకు తీసుకుని ధాన్యం ఆరబెట్టుకుంటున్నట్లు రైతులు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ముందుకురాని మిల్లర్లు

రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లర్ల యజమానులు ముందుకురావడం లేదు. ప్రతి సంవత్సరం జిల్లా అధికారులు రైస్‌మిల్లర్లకు కొనుగోలు చేయాలని ముందుగానే అనుమతులు ఇస్తారు. కానీ ఇప్పటి వరకు రైస్‌మిల్లర్లకు కొనుగోలు చేయాలని సూచించినా మిల్లుల్లో స్థలం లేక ధాన్యం తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. గత సంవత్సరం మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో ప్రస్తుతం ధాన్యం దింపుకోవడం లేదని తెలిసింది.

కల్లాల్లో ధాన్యం పోసినం



కల్లాల్లో ధాన్యం పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నాం. అసలే స్థలాల కొరత ఉంది. వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి. ధాన్యం కుప్పల వద్ద చలిలో పడిగాపులు కాస్తున్నాం. వెంటనే అధికారులు స్పందించి కొనుగోళ్లు ప్రారంభించాలి.

– దాసె వేణు, రైతు, అచ్చన్నపల్లి

కొనుగోళ్లు ప్రారంభించాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు తక్కువ ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– విలాసాగరం లక్ష్మణ్, రైతు, వట్టెంల

మూడు రోజుల్లో ప్రారంభిస్తాం



సొసైటీ తరుపున ఈ సంవత్సరం కూడా 15 కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలి. ప్రతి గింజను సొసైటీ ద్వారానే కొనుగోలు చేస్తాం. రైతులు తొందరపడవద్దు.

– ఏనుగు తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, వేములవాడ

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

- వేములవాడ సీఐ కృష్ణకుమార్
- ఎస్సైల ఆధ్వర్యంలో వివిధ ఠాణాల్లో ఓపెన్ హౌజ్

వేములవాడరూరల్/తంగళ్లపల్లి/కోనరావుపేట/గంభీరావుపేట: పోలీసులు ప్రజల రక్షణ కోసమే పనిచేస్తారని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఠాణాలో ఉండే విభాగాలు, సిబ్బంది, వారి విధుల గురించి విద్యార్థులకు వివరించారు. పౌరులకు అందించే సేవలు, డయల్ 100, షీటీమ్, సైబర్ క్రైమ్, పోలీస్ ఆయుధాల గురించి వివరించి అవగాహన కల్పించారు. పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వీహెచ్‌ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్‌లైన్ ఎఫ్‌ఐఆర్, ఆయుధాలు భద్రపరచే గది, ఆయుధాలు, సీసీ కెమెరాల కమాండ్ రూం గురించి విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ మారుతి, ఏఎస్‌ఐ మల్లయ్య, సిబ్బంది రాజశేఖర్, వెంకటేశ్, శంకర్, తిరుపతి ఉన్నారు. అలాగే గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మహేశ్, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వి.వెంకటేశ్వర్లు, కోనరావుపేటలో ఎస్సై అంజనేయులు, ఇల్లంతకుంట ఠాణాలో ఎస్సై దాస సుధాకర్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ నిర్వహించారు.



వేములవాడరూరల్ ఠాణాలో మాట్లాడుతున్న సీఐ కృష్ణకుమార్, కోనరావుపేటలో ఎస్సై ఆంజనేయులు


తంగళ్లపల్లి: ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ గురించి వివరిస్తున్న ఎస్సై డి.సుధాకర్

క్లుప్తంగా

ఘనంగా శ్రీశివకేశవుల బ్రహ్మోత్సవాలు


ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో శ్రీశివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య తెలిపారు. గణపతి పూజ, విశ్వక్సేనారాధన, విష్ణు సహస్రనామం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. హరీశ్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఆదివారం స్వామి వారి రథాలపై భక్తులకు దర్శనం ఇస్తారు. సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ మంజుల, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతి, చంద్రం, సత్తయ్య పాల్గొన్నారు.

'మన ఊరు మన బడి' పనుల పరిశీలన



పాఠశాలను సందర్శించిన అధికారులు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులను శుక్రవారం థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ టీం అధికారులు పరిశీలించారు. టీపీ క్యూసీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. పాఠశాల స్టాక్ రిజిస్టర్, డ్యూయల్ డెస్క్‌లు, ఫర్నీచర్, పెయింటింగ్ నాణ్యతను తనిఖీ చేశారు.

'అల్పాహారం అందించలేం'


వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట: పాఠశాలల్లో తాము అల్పాహారం, రాగి జావా, కోడి గుడ్లు అందించలేమని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీలో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. రాగి జావ సరఫరా చేస్తున్న వారికి ప్రభుత్వం విద్యార్థికి రూ.1.25 చొప్పున చెల్లిస్తుందని, వండి పెడుతున్న తమకు మాత్రం ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని లేకుంటే తాము రాగి జావ అందించలేమన్నారు.

యథేచ్ఛగా దళారుల కొనుగోళ్లు


గుండన్నపల్లి రోడ్డు పరిసరాల్లో కొనుగోళ్లు

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లలో దళారుల హవా కొనసాగుతోంది. వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు మండలంలో ఇంకా ప్రారంభం కాలేదు. వరి పంటలు కోసిన రైతులు గతంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాల్లో ధాన్యం రాసులు పోశారు. దీంతో దళారులు దర్జాగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అధికారుల పట్టింపులేని తనం దళారులకు వరంలా మారింది. ప్యాడీ సెంటర్లు ప్రారంభం కాకపోవడంతో దళారీ చెప్పిన ధరకే ధాన్యం విక్రయిస్తూ రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికే కొన్నివేల క్వింటాళ్ల ధాన్యం దళారుల పాలైంది. ఎలాంటి లైసెన్స్ లేకుండా దర్జాగా కొనుగోళ్లు చేస్తూ బోయినపల్లి మార్కెట్ యార్డు ఖజానాకు గండికొడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్, సుద్దాల గ్రామాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీల్లో వచ్చే, పోయే వాహనాలను ఆపుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో డబ్బులు వెంట పెట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్నమే రథోత్సవం

- సాయంత్రం 5 గంటలకు ఆలయ మూసివేత
- ఆలయ ఈవో మారుతిరావు

సిరిసిల్లటౌన్: చంద్ర గ్రహణం కారణంగా శనివారం జరిగే శ్రీశాల క్షేత్ర వెంకన్న రథోత్సవం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఈవో మారుతిరావు శుక్రవారం ప్రకటించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రథంపై స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. తదుపరి పురవీధుల్లో రథోత్సవం నిర్వహించి సాయంత్రం 5 గంటల వరకు ఆలయం మూసి వేయడం జరుగుతుందని, భక్తుల గమనించి సకాలంలో విచ్చేయాలని కోరారు. రథోత్సవం నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. నవంబర్ 1న ఆలయంలో హుండీ లెక్కింపు ఉంటుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా తీర్మానం


ఆదికి మద్దతు ఇస్తామని తీర్మానించి ప్రతిజ్ఞ చేస్తున్న కుటుంబాల సభ్యులు

రుద్రంగి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రుద్రంగి వాస్తవ్యులైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వెంటే తాము ఉంటామని, తమ ఓట్లతో పాటు తమ బంధు, మిత్రులందరితో ఓట్లు వేయిస్తామని మండల కేంద్రానికి చెందిన 52 కుటుంబాల సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు తీర్మానప్రతిని అందజేశారు. అనంతరం ఆదికి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సార్లు వేములవాడ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఓటమి చెందినా ఎళ్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలిగినా పరిష్కరిస్తున్న బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్‌కే తమ మద్దతు అని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేయాలని వారు కోరారు.

ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ నాయకుల ప్రచారం

గంభీరావుపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిస్తున్న ఆరు గ్యారంటీ హామీలపై ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మండలంలోని దమ్మన్నపేటలో శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి పథకాలపై అవగాహన కల్పించారు. సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


గంభీరావుపేట: దమ్మన్నపేటలో ప్రచారం

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రంలో శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. రైతుబంధును నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ లింగం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం


తంగళ్లపల్లి మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కూరగాయలు విక్రయించేవారి వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని, మంత్రి కేటీఆర్‌కు భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, ఎంపీటీసీ కోడి అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి


రుద్రంగిలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ మీనయ్య

రుద్రంగి: అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. మండల కేంద్రంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు పాల్గొన్నారు.

నిమ్మపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ గోగు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


నిమ్మపల్లి మార్కెట్‌లో ప్రచారం చేస్తున్నగోగు ప్రతాపరెడ్డి, నాయకులు

గోలి పయనమెటు?

- వీడనున్న బీఆర్‌ఎస్ బంధం
- నేడు వీడనున్న సందిగ్ధం


డాక్టర్ గోలి మోహన్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన డా.గోలి మోహన్ బీఆర్‌ఎస్ పార్టీలో మొదటి నుంచి సీనియర్ నాయకుడుగా పేరుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగే వారిలో ఒకరైన ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్‌ఆర్‌ఐ తరుపున కీలక పాత్ర పోషించారు. కానీ గత ఎన్నికల్లో ఆయన వేములవాడ నియోజకవర్గ స్థానాన్ని ఆశించినప్పటికీ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పోటీ చేసేందుకు ఆసక్తి చూపడంతో గోలి మోహన్‌కు టికెట్ దక్కలేదు. ఈసారైనా బీఆర్‌ఎస్ పార్టీ తరుపున టికెట్ కావాలని మొదటి నుంచి కోరుతున్నా, చివరిగా చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు టికెట్ ఇవ్వడంతో ఆయన అలకబూనారు. వేములవాడ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో కొన్ని నెలలుగా అధ్యా గోలి ఫౌండేషన్ పేరుతో ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. అయినా అధికార పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో శనివారం తన భవిష్యత్‌పై ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్ణయించుకోనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ టికెట్లు కూడా ఖరారు కావడంతో, చివరకు బీఎస్పీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సీపీఎం నుంచి గణేశ్ బహిష్కరణ

సిరిసిల్లటౌన్: సీపీఎం పార్టీ నుంచి జిల్లా కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న అన్నల్‌దాస్ గణేశ్‌ను సస్పెండ్ చేసినట్లు శుక్రవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూశం రమేశ్ ప్రకటించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాలు, నియమాలకు విరుద్ధంగా పనిచేస్తున్న గణేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆయనకు పార్టీకి భవిష్యత్‌లో ఎలాంటి సంబంధాలు ఉండవని ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు గన్నేరం నర్సయ్య, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జువ్వాజి విమల, సూరం పద్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత కారణాలతో రాజీనామా

ఇదిలా ఉండగా.. తన వ్యక్తిగత కారణాలతో సీపీఎం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు అన్నల్‌దాస్ గణేశ్ ప్రకటించారు. ఇన్ని రోజుల తనకు సహకరించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవంలో భాగంగా ప్రతిజ్ఞ, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి హస్తకళా మట్టి ఆకృతులను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసరవేని పర్షరాములు, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.